క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మందిరం ప్రతిష్ట



హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కొత్తపేటలో స్థానికులు రూ.14 లక్షలు వెచ్చించి నిర్మించిన హనుమాన్ మందిర ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మందిరం, విగ్రహ ప్రతిష్ట, దర్ప దర్శనం, సర్వదర్శన కార్యక్రమాలను రుత్వికులు రాజేశ్వర శర్మ చేయించారు. మధ్యాహ్నం మందిర ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



అభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహం

ఎల్.ఎన్.పేట: మండలంలోని గార్లపాడు వంశధార పునరావాస కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తుల కోసం స్వామివారి సన్నిధిలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నాణ్యత తప్పనిసరి



ద్వారకాపురం వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న డీఈఈ రాధారాణి

పాతపట్నం: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ప్రాజెక్టు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.రాధారాణి అన్నారు. మండలంలోని తెంబూరు రోడ్డు నుంచి ద్వారకాపురం గ్రామం వరకు పీఎంజన్‌మన్ నిధులు రూ.63 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను డీఈఈ ఆదివారం పరిశీలించారు. రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. పీఆర్ జేఈ కె.నాగేశ్వరరావు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మాకవరంలో రైతు పాత్రకొండ శేషగిరికి చెందిన మూడెకరాల పొలంలో నవధాన్యాల విత్తనాలను ఆదివారం వెదజల్లించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ రైతు నవధాన్యాలు సాగు చేయడం వలన పొలంలో తేమ ఎక్కువ రోజులు ఉంటుందన్నారు. పలు రకాల విత్తనాలు వేయడం వలన భూమికి మేలు చేస్తాయన్నారు. వరి పంటలో కలుపు ఇబ్బంది ఉండదన్నారు. ఎరువులు ఖర్చు తగ్గుతుందన్నారు. ఆరోగ్యవంతమైన పంట పండించడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జీసీసీ రేషన్ డిపోలు



ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపో

పాతపట్నం: మండలంలోని లాబర, బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపోలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు రేకులు పూర్తిగా పాడయ్యాయి. గోడలకు బీటలు వారాయి. చిన్నవర్షం జల్లు కురిసినా గదుల్లోకి నీరుచేరి నిత్యావసర సరుకులు తడిచిముద్దవుతున్నాయి. ఏళ్లు కావస్తున్నా మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరాయని గిరిజనులు వాపోతున్నారు. లాబర డిపోకు నిధులు మంజూరైనప్పటికీ భవనం నిర్మాణం కాలేదు. ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ డిపోలను బాగుచేయాలని కోరుతున్నారు.

ఖరీఫ్ సాగుకు.. నీటి కష్టాలు!



కొత్తకోట అవుట్ ఫ్లో వద్ద పనిచేయని షట్టర్లు


ఆమదాలవలస నియోజకవర్గంలో ఆయకట్టు(హెక్టార్లు) వివరాలు ఇలా				
మండలం	సరుబుజ్జిలి	ఆమదాలవలస	బూర్జ	పొందూరు
ఆయకట్టు	5,200	6,810	5,820	6,350

- మరమ్మతులకు నోచుకోని కాలువలు
- పట్టించుకోని యంత్రాంగం
- వృథాగా సాగునీరు

సరుబుజ్జిలి: వంశధార ప్రధాన, పిల్ల కాలువల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడం వలన రైతులకు ప్రతిఏటా సాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో సుమారు 24,150 వేల హెక్టార్ల భూమి సాగు చేస్తున్నారు. పంట చేతికందివచ్చే దశలో సాగునీరు అందక ప్రతిఏటా రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. ప్రధానంగా కౌలుకు వ్యవసాయం చేసే రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి అప్పులు పాలవుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం వలన రైతులు చుక్కనీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. మండలంలోని ఎ.ఎల్.నగరం నుంచి పురుషోత్తపురం వరకు సుమారు 16 కిలో మీటర్లు మేర వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, 22 పిల్ల కాలువలు విస్తరించి ఉన్నాయి. వీటి ద్వారా 4 వేల హెక్టార్ల భూమి సాగు చేస్తున్నారు. 14 కిలో మీటర్లు మేర యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా సుమారు 2 వేల హెక్టార్ల భూమి సాగు జరుగుతుంది.

శిథిలమైన షట్టర్లు..

వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్ల నిర్వహణ సక్రమంగా చేయడంలేదు. చెక్ డ్యామ్‌లు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీటిని మళ్లించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సాగునీరు వృథాగా పోవడం తప్ప నిల్వ చేయడానికి అవకాశం లేకుండా పోతుంది. అత్యవసర పరిస్థితుల్లో చుక్క నీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు.



పురుషోత్తపురం వద్ద శిథిలావస్థకు చేరిన షట్టర్లు



పురుషోత్తపురం వద్ద షట్టర్లు లేని మురగడ కాలువ

కర్ర చెక్కలే షట్టర్లు..

షట్టర్లు ఏర్పాటు చేయకపోవడం వలన కొన్ని చోట్ల రైతులు సొంతంగా కర్ర చెక్కలు ఏర్పాటు చేసి తన పొలాలకు సాగునీటిని మళ్లిస్తున్నారు. మరికొంతమంది వరి గడ్డిని సాగునీటికి అడ్డంగా పెట్టి, వాటిపై మట్టివేసి నీటికి అడ్డుకట్ట వేస్తున్నారు. నీటి ఉధృతి పెరిగినప్పుడు ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి.

షటర్లు లేక ఇబ్బందులు



కాలువల నుంచి పిల్ల కాలువలకు సాగునీరు మళ్లించాలంటే తప్పని సరిగా షట్టర్లు ఉండాలి. చాలాచోట్ల షట్టర్లు పని చేయడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో షట్టర్లకు ఉన్న నట్లు పని చేయడంలేదు. కర్ర చెక్కలనే షట్టర్లగా వాడుతున్నాం.

– బడద రాజప్పలనాయుడు, రైతు, సింధువాడ, సరుబుజ్జిలి

పర్యవేక్షణ కరువు



కాలువల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడం వలన ప్రతిఏటా సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. కనీసం ఏడాదికి ఒక్కసారైనా అధికారులు క్షేత్రసాయిలో పర్యటనలు చేయడం లేదు. షట్టర్లు, చెక్ డ్యామ్‌లు నిర్వహణ లేక సాగునీటి సరఫరా సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

– తులగాపు తిరుపతిరావు, రైతు, రావివలస, సరుబుజ్జిలి

పరిశీలన చేస్తాం

కాలువల పనితీరు పరిశీలన చేస్తాం, షట్టర్లు, కాలువ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. మంజూరైతే పనులు చేపడతాం.

– వెంకటరావు, జేఈ, వంశధార

మోసం కూటమి నైజం



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇస్తామని చెప్పిన పలు సంక్షేమ పథకాలు ఏడాది అవుతున్నా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు దీపావళి తర్వాత ఒక గ్యాస్ సిలిండర్ ఇచ్చి ఇప్పటివరకు మిగిలిన రెండు గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పథకం పేరుతో మహిళలకు ఇస్తామని నమ్మించిన గత ఏడాది బకాయి ఉన్న డబ్బులు కూడా తక్షణమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళితే వారందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వారిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గతేడాది ఇంటర్ చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులకు సిద్ధమవుతున్నారని వారికి కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు. ఆడబిడ్డ నిధి రూ.18 వేలు ఎప్పుడు చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌తోపాటు మరో 143 పథకాలు అమలు చేస్తామని, నమ్మించి మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

యువత దేశభక్తి కలిగి ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

నరసన్నపేట: నేటి యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని పెంపొందించాలని ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహక సభ్యుడు అంధవరపు పద్మరాజు అన్నారు. నరసన్నపేటలో ఆదివారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని (శివాజీ మహారాజ్ పట్టాభిషేకం చేసిన రోజు) ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం సమావేశం నిర్వహించి శివాజీ హిందూ సామ్రాజ్యం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. శివాజీ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కోరాడ రామచంద్రరావు, కె.,ఎల్.ఎన్.మూర్తి, కె.ఎన్.బి.గుప్త. తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ

ఎల్.ఎన్.పేట: మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. మోదుగువలస కాలనీ సమీపంలో వంశధార 5ఎల్ పిల్ల కాలువ పక్కనున్న వెంకటేశ్వర రైస్ మిల్లు ప్రహరీ కూలిపోయింది.



కూలిన రక్షణ గోడ

నిరుపయోగం!

- మూలకు చేరిన ట్రాక్టర్ ఇంజిన్లు
- మంజూరుకాని ట్రక్కులు
- పట్టించుకోని అధికారులు



సారవకోట సచివాలయ ఆవరణలో ఉన్న ట్రాక్టర్ ఇంజిన్



బుడితి ఉన్నత పాఠశాల సైకిల్ షెడ్‌లో ఉన్న ట్రాక్టర్ ఇంజిన్

సారవకోట: మండలంలోని సారవకోట, బుడితి పంచాయతీల్లో చెత్త సేకరణకు కేటాయించిన రెండు ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. సుమారు 5 నెలల క్రితం చెత్త సేకరణకు ప్రభుత్వం ట్రాక్టర్లు మంజూరు చేసింది. అయితే వీటికి కావాల్సిన ట్రక్కులు ఇవ్వకుండా ఇంజిన్లు మాత్రమే అందజేశారు. దీంతో వీటిని పని లేకపోవడంతో సారవకోట సచివాలయం ఆవరణలో, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైకిల్ షెడ్‌లో ఉంచారు. ఇంజన్లు నెలల తరబడి నిరుపయోగంగా ఉండటంతో అవి పాడైపోయే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వం హయాంలో సారవకోటలో చెత్త సేకరణ కోసం మినీ వాహనం మంజూరు చేయగా.. దానినే ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ఆ వాహనం ఒకటి, రెండు వీధుల్లో తిరిగి చెత్తను తరలించి మరలా రావల్సి వస్తుంది. ట్రాక్టర్ మంజూరు చేసినా దాని ట్రక్కు మంజూరు చేస్తే ట్రాక్టర్‌పై ఒకేసారి చెత్తను సేకరించి దానిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించవచ్చు. బుడితి పెద్ద పంచాయతీ అయినప్పటికీ గతంలో ఎటువంటి వాహనాలు మంజూరు కాకపోవడంతో చిన్న రిక్షాలతో చెత్త సేకరణ చేపడుతున్నారు. ఈ పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైనా దానికి ట్రక్కు మంజూరు కాక పోవడంతో ఇంజిన్ మూలకు చేరింది.

ట్రాక్టర్ ఇంజిన్ మూలకు చేరింది



ట్రాక్టర్ ఇంజిన్ మంజూరు చేసి నెలలు కావస్తున్నా దానికి అవసరమైన ట్రక్కు మంజూరు చేయకపోవడంతో మూలకు చేరింది. ఇప్పటికే సుమారు 6 నెలలు పూర్తయ్యాయి. ఇంకా అలాగే ఉంటే ఆ ఇంజిన్ స్టార్ అయ్యే అవకాశం లేకుండా పోతుంది.

– గుణుపురం రామారావు, వైస్ ఎంపీపీ, సారవకోట

షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన రావాడ అనిత షైనింగ్‌స్టార్ అవార్డుకు ఎంపికైంది. మండల కేంద్రంలోని నవతేజ పాఠశాలలో చదివి 10వ తరగతి ఫలితాల్లో 591 మార్కులు సాధించింది. ప్రభుత్వం సోమవారం జిల్లా కేంద్రంలో అందించే ఈ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. అవార్డు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

హిరమండలం నుంచి ఇద్దరు..

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న ఇద్దరు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్షల్లో 582 మార్కులు సాధించిన టి.షర్మిళపూజిత, 579 మార్కులు సాధించి భరత్ అవార్డులకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరగనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. రూ.20 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రంతో విద్యాశాఖ అధికారులు సన్మానించనున్నారు. ఇద్దరు విద్యార్థులను ఎంఈఓ రాంబాబు, హెచ్ఎం కేశవరావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సింహాద్రి కల్యాణి, వైస్ చైర్మన్ గొంటి అప్పయ్య తదితరులు అభినందించారు.

ఘనంగా జ్యోతిర్లింగాల ప్రతిష్ట మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని ఎస్ఎస్ కాలనీలో గల భవానమ్మ ఆలయంలో 12 జ్యోతిర్లింగాలతో పాటు 23 దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ నెల 6 తేదీ నుంచి ప్రారంభమైన ప్రతిష్ట మహోత్సవాలు వేద మంత్రాలు, శాంతి హోమాలు, ప్రత్యేక అభిషేకాలు, జలాభిషేకాలు మధ్య వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, భవానమ్మ దీక్ష గురువు చెంగల తవుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ కాలనీ, కొత్తూరు, కల్లెమ్మ, మహసింగి, పారాపురంతోపాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గుమ్మ గెడ్డ అభివృద్ధి జరిగేనా?



రొంపివలస సమీపంలో పూడికతో నిండిన గుమ్మగెడ్డ

పాతపట్నం: మండలంలోని గుమ్మగెడ్డ ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. చాకిపల్లి, ఎ.ఎస్.కవిటి, రొమదల, రొంపివలస, సీది, కొరసవాడ, తామర, తీమర, గంగువానిపేట, పాతపట్నం సమీపంలో సుమారు 2,000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుమ్మగెడ్డ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం గుమ్మగెడ్డ చానల్‌లో పూడికలు పేరుకుపోయాయి. నీటి ప్రవాహానికి అవరోధంగా ఏర్పడ్డాయి. గుమ్మగెడ్డను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుమ్మగెడ్డను మెరుగుపర్చాలని కోరుతున్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- ప్రాథమిక విద్యకు తూట్లు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ కార్పొరేట్ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2020లో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ విధానంలో (5+3+3+4) 6 నుంచి 18వ సంవత్సరం వరకు ఇంటర్మీడియెట్ విద్యను బోధించడం కోసం ఈ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. 2023లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఈ విధానాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఫౌండేషనల్ లీటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) విధానాన్ని తీసుకువచ్చి, పాఠశాల ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఎత్తివేశారన్నారు. జిల్లాలో 290 ప్రైమరీ స్కూల్స్ ఉండగా వాటిలో 248 పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చేశారన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను ఆ పాఠశాలల నుంచి తొలగించి ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉండేలా ఈ నెల 11వ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. 333 అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఉండగా వాటిలో 93 పాఠశాలలను ప్రైమరీ, మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చేశారని, ఈ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులను తొలగించేశారన్నారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎక్కడికిపోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో..

ఆమదాలవలస నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో 22 అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఉండగా, పొందూరు మండలంలోని బురిడికంచరాం, కొంచాడ పాఠశాలను మాత్రమే ఉంచి మిగిలిన 20 పాఠశాలలను ప్రైమరీ పాఠశాలలుగా మార్చేశారన్నారు. 220 ప్రైమరీ పాఠశాలలు నియోజకవర్గంలో ఉండగా 46 ప్రైమరీ పాఠశాలలను ఎత్తేసి ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చేశారన్నారు. ఆమదాలవలస మండలంలో 52 ప్రైమరీ స్కూల్స్ ఉండగా 13 స్కూల్స్‌ను ఎత్తేసి ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చేశారని, మున్సిపాలిటీలో 27 స్కూల్స్ ఉండగా ఐదు స్కూళ్లను ఫౌండేషన్ స్కూల్స్‌గా, పొందూరులో 45 ప్రైమరీ స్కూల్స్ ఉండగా 13 స్కూల్స్‌ను, బూర్జలో 45 స్కూల్స్ ఉండగా 14 స్కూల్స్‌ను, సరుబుజ్జిల్లో 44 ప్రైమరీ స్కూల్స్ ఉండగా మూడు స్కూల్స్‌ను తొలగించి ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చేశారన్నారు.

పాఠశాలల రూపు రేఖలను మార్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ..

గత ప్రభుత్వంలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు పథకం కింద పాఠశాల రూపురేఖలు మార్చి విద్యను బలోపేతం చేశారన్నారు. పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, డ్రింకింగ్ వాటర్, స్టేట్ సిలబస్‌ను సీబీఎస్ఈ సిలబస్‌తో అనుసంధానం, టోఫెల్ కోర్స్, విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించారన్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు కోల్పోతున్న పాఠశాలలకు చెందిన ఎస్ఎంసీ కమిటీలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసి తనకు అందజేస్తే న్యాయ పోరాటం చేసి అడ్డుకుంటానని తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు అక్రమ ఆర్జనపై ఉన్న దృష్టి పేదల విద్య పట్ల లేదన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పార్టీ నాయకులు మామిడి రమేష్, కూన రామకృష్ణ, దన్నాన అజయ్‌కుమార్, పార్టీ జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయం



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని రెడ్డికిపేట హలహలేశ్వరాలయం వద్ద గోతులమయంగా ఉన్న రహదారి. బాలసీమ–బసివలస రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. వర్షాలు కురవడంతో రోడ్డు మరింతగా అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో కనీసం గోతులైనా పూడ్చలేదని విమర్శలు వస్తున్నాయి. గోతులైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– నరసన్నపేట

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఎల్.ఎన్.పేట మండలంలోని కృష్ణాపురం గ్రామంలో చెవిటమ్మ తల్లి ఆలయానికి వెళ్లే దారిలో, ప్రాథమికోన్నత పాఠశాలకు సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎప్పటికప్పుడు మంటలు, పొగలు వస్తున్నాయని ఆ సమయంలో ఫీజులు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్కువ ఎత్తులో ఉన్న ఒక దిమ్మపై ఉంచారని, ఈ ప్రాంతాంలో చిన్నారులు ఆటలు ఆడుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అందువలన అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

అధ్వానం..



ఆమదాలవలస మున్సిపాలిటీ 13వ వార్డు సాయి నగర్‌లో రోడ్లులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. ఈ రహదారిలో ప్రయాణించే వారు ఇక్కట్లు పడుతున్నారు. వాహనాల రాకోపోకలకు ఇబ్బంది కలుగుతోంది. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్నా అధికారులు పట్టికోవడంలేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస